క్లుప్తంగా

ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న నాయకులు

ఆదోని సెంట్రల్: ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సీనియర్ ఉపాధ్యాయులను ఎస్టీయూ నాయకులు ఘనంగా సన్మానించారు. శుక్రవారం ఎస్టీయూ భవనంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్టీయూ జిల్లా అసోసియేట్ ప్రసిడెంట్ నాగేంద్రప్ప అధ్యక్షతన జరిగిన కార్యక్రమములో కౌతాళం మండలం బదినేహాలులో ప్రాథమిక పాఠశాల ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం బసవరాజు, ఆదోని మండలం అలసందగుత్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ఏగా పని చేస్తున్న నాగ ప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమములో ఎస్టీయూ సీనియర్ నాయకులు వెంకటస్వామి, కాశీ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

గాయత్రీ మాతకు ప్రత్యేక పూజలు

ఆస్పరి: రామతీర్థంలో వెలసిన గాయత్రీ మాత ఆలయంలో, ఆస్పరిలోని మారెమ్మవ్వకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో అర్చకులు రూపామోహన్ శర్మ, గోవిందు ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, హోమం, మంగళహారతులు తదితర పూజలు చేపట్టారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

వరద బాధితులకు సాయం



సీపీఐ ఆధ్వర్యంలో విజయవాడకు పంపుతున్న మంచినీటి బాటిళ్లు, బిస్కెట్ ప్యాకెట్లు

ఎమ్మిగనూరురూరల్: వరదల్లో సర్వం కోల్పోయిన విజయవాడ వాసులకు అండగా నిలిచేందుకు పట్టణంలోని భాష్యం ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు తమ వంతుగా నిత్యావసర సరుకులను శుక్రవారం పంపించారు. ప్రిన్సిపాల్ మాచాని కవిత మాట్లాడుతూ తమ స్కూల్ విద్యార్థులు వరద బాధితులకు తమ వంతుగా తెచ్చిన బియ్యం, బ్యాళ్లు, నూనెతో పాటు నిత్యావసర సరులను విజయవాడలోని నిరాశ్రయులకు పంపుతున్నట్లు తెలిపారు.

బిస్కెట్లు, మంచినీరు

ఎమ్మిగనూరుటౌన్: విజయవాడ వరద బాధితుల కోసం సీపీఐ ఆధ్వర్యంలో మంచినీటి బాటిళ్లు, బిస్కెట్ ప్యాకెట్లను శుక్రవారం ఆ పార్టీ నాయకులు పంపించారు. వాటి విలువ రూ.30వేల ఉంటుందని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య తెలిపారు. ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి శ్రీనివాసులు, గౌస్, సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, నాయకులు వంపణ్ణ గౌడ్, భాస్కర్‌యాదవ్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో ప్రతి ఒక్కరూ తమ నివాసాల వద్ద మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం పట్టణంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో డిపో మేనేజర్ అమర్నాథ్‌తో కలిసి మొక్కలు నాటారు.

మెడికల్ కళాశాల పనులు కొనసాగించాలి

ఆదోని టౌన్: పశ్చిమ ప్రాంత ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్న ఆలోచనతో గత ప్రభుత్వం ఆదోనిలో మెడికల్ కళాశాలను నిర్మించతలపెట్టిందని, ప్రస్తుత ప్రభుత్వం పనులను అడ్డుకోవడం బాధాకరమని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి కె.నాగరాజు అన్నారు. శుక్రవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో పరిపాలనాధికారిణికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదోని మెడికల్ కళాశాల పనులను నిలిపివేయాలని ఇచ్చిన జీవో, మెమోలను రద్దు చేయాలన్నారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు వైద్యసేవలు అందేలా చూడాలన్నారు. వివిధ సంఘాల నాయకులు ఎం.సత్యన్న, చెన్నకేశవులు, బాలరాజు, హనుమంతప్ప, బాబు, సోమశేఖర్, మంజునాథ్ పాల్గొన్నారు.

దేశ ఆర్థిక దిక్సూచి ఎల్ఐసీ

ఎమ్మిగనూరుటౌన్: ఎల్ఐసీ దేశానికి ఆర్థిక దిక్సూచి లాంటిదని ప్రముఖ వైద్యుడు మాలకొండయ్య, స్థానిక ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్ పులినాయక్ అన్నారు. ఎల్ఐసీ వారోత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం సాయంత్రం స్థానిక బ్రాంచ్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్ సంతోష్‌కుమార్, ఏఓ మహేష్‌కుమార్, ఎల్ఐసీ ఉద్యోగుల సంఘ నాయకుడు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆదిపూజకు వేళాయె!

- నేడు వినాయక చవితి
- పట్టణం, గ్రామాల్లో పండుగ సందడి

ఎమ్మిగనూరు: ఆదిపూజకు అధ్యుడైన వినాయకుని పండుగకు హడావుడి మొదలైంది. శనివారం చవితి సందర్భంగా వినాయకుని ప్రతిష్ఠించి మూడు రోజులపాటు ఉత్సవాలు జరిపేందుకు భక్తులు, వినాయక మండళ్ల పాలకవర్గాలు ఏర్పాట్లు పూర్తి చేసుకున్నాయి. శుక్రవారం ఎటుచూసినా వినాయకచవితి సామగ్రితో ఎమ్మిగనూరు కిటకిటలాడింది. ఎమ్మిగనూరు పట్టణంతోపాటు నియోజక వర్గంలోని వివిధ గ్రామాల్లో వీధివీధిన బొజ్జగణపయ్యలు కొలువుదీరనున్నారు.

రూపుదిద్దుకొంటున్న 'ఉగ్రనరసింహుడు'

పట్టణంలోని లక్ష్మీపేట మహావినాయక యువక మండలి సభ్యులు ఏటేటా వైవిధ్యభరితంగా వినాయకుని తయారు చేస్తారు. కొండవీటిప్రాంతం బాలవినాయకమండలి సభ్యులు తెలుగురాముడు, బండా శేఖర్, అశోక్, రఘురవీరలు శ్రమించి రుద్రాక్షలతో ఉగ్రనరసింహుడు'రూప వినాయకుణ్ణి రూపొందించారు. అదేవిధంగా తేరుబజారు, శివసర్కిల్, గాంధీనగర్, వీవర్సుకాలనీ, సోమప్ప నగర్‌లలో వైవిధ్య భరితంగా వినాయకులను తయారుచేసి శనివారం పూజకు ప్రతిష్టంచనున్నారు.

జోరందుకున్న వ్యాపారాలు

ఎమ్మిగనూరు టౌన్: పట్టణంలోని సోమప్ప సర్కిల్ వినాయక భక్తులతో కిటకిటలాడింది. మట్టి వినాయకుడి ప్రతిమలు, చెరకు గడలు, అరటి, పండ్లు, పూలు, మామిడి, అరటి ఆకులు, పూజాసామగ్రీల కొనుగోలు చేసేందుకు స్థానికులతో పాటు గ్రామీణులు పెద్ద ఎత్తున తరలిరావడంతో పట్టణంలో వ్యాపారాలు జోరందుకున్నాయి.

కొలువుదీరనున్న గణనాథులు

కోసిగి: వినాయక చవితి వేడుకలను పురస్కరించుకుని శనివారం కోసిగి మండలంలో వాడవాడలా గణనాథులు కొలువుతీరనున్నారు. శుక్రవారం కోసిగి మండలంలోని వివిధ ప్రాంతాలలో విగ్రహాల ప్రతిష్టాపనకు మండపాలను సంసిద్ధం చేశారు. ఆదోని, రాయచూరు, కోసిగి, మహారాష్ట్రలో షోలాపూర్ ప్రాంతాల నుంచి గణపయ్యలను కొనుగోలు చేసి మండపాలకు చేర్చారు. కోసిగితో పాటు మండలంలోని 26 గ్రామాల్లో గణపయ్యలు కొలువుదీరనున్నట్లు వినాయక మిత్ర మండలి సభ్యులు తెలిపారు.





ఎమ్మిగనూరులో పండుగ సామగ్రి కొనుగోలు దృశ్యం, పట్టణంలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న మట్టి వినాయక ప్రతిమలు



ఆదోనిలో ఉచితంగా మట్టి విగ్రహాలను అందజేస్తున్న ఆర్‌ఆర్‌జీ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు తిమ్మన్నగౌడ



సోమప్ప సర్కిల్‌లో వినాయకుడి పూలు,పండ్లు, చెరకు గడల.అరటి, మామిడి ఆకుల విక్రయాలు

మట్టి గణనాథుల పంపిణీ

ఆదోని అర్బన్: మట్టి గణనాథులను అందించడం సంతోషంగా ఉందని ఆర్‌ఆర్‌జీ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు తిమ్మన్నగౌడ అన్నారు. శుక్రవారం స్థానిక వీరశైవ కళ్యాణ మండపంలో వెయ్యి మట్టి గణపతులను పంపిణీ చేసినట్లు చెప్పారు. పర్యావరణాన్ని కాపాడాలని శాస్త్రీయంగా, సాంప్రదాయబద్ధంగా మొదటి సంవత్సరం 300 విగ్రహాలతో ప్రారంభం చేసి 3 వేల వరకు మట్టి విగ్రహాలను పంపిణీ చేశామన్నారు. ప్రస్తుతం 16వ సంవత్సరం నేటితో పూర్తి అయ్యిందన్నారు. శాస్త్రీయంగా ఐదు రకాల నది నీరు, మట్టి, ఆవుపాలు, ఆవు పేడ, గోమూత్రంతో గణపతులను తయారు చేసి భక్తులకు అందజేస్తున్నట్లు చెప్పారు. సాంప్రదాయబద్ధంగా నిష్టతో తయారు చేసిన గణపతులు తమ వద్ద అందుబాటులో ఉన్నాయన్నారు.



కోసిగిలో కొలువుదీరనున్న గణపయ్య

అన్ని ఏర్పాట్లు చేశాం

పట్టణంలో వినాయక చివితి వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేశాం. వినాయక మండలపాల వద్ద ప్రత్యేక పారిశుద్ధ్య పనులను చేపట్టాం. ప్రధానసర్కిళ్లు, నిమజ్జనఘాట్ వద్ద విద్యుదీకరణ, నిమజ్జనం జరిగే సోమవారం రోజు ఎల్లెల్సీ కాలువ వద్ద నాలుగు క్రేనులను ఏర్పాటు చేశాం. పట్టణంలో సుమారు 350దాకా విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. – ఎస్ గంగిరెడ్డి, కమిషనర్,ఎమ్మిగనూరు

వేడుకలు ప్రశాంతంగా జరుపుకోండి

ఎమ్మిగనూరురూరల్: మండలంలో వినాకయ చవితి వేడుకలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని రూరల్ సీఐ విక్రంసింహా సూచించారు. శుక్రవారం స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో మండలంలోని వినాయక విగ్రహ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. వేడుకల్లో ఎటువంటి పొరపాట్లు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత కమిటీ సభ్యులపై ఉందన్నారు.

గణేష్ ఉత్సవాలను విజయవంతం చేద్దాం

- నిమజ్జనానికి పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలి
- ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: అన్నిశాఖల సమన్వయంతో గణేష్ ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పిలుపునిచ్చారు. శుక్రవారం వినాయక ఘాట్ వద్ద నిర్వహించిన గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో, డివిజన్ స్థాయి అధికారులతో గణేష్ ఉత్సవాల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 7న జరిగే వినాయక చవితి పండగ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా ఆదోని పట్టణంలో ఈనెల 11వ తేదీన జరిగే నిమజ్జనం కార్యక్రమంలో అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలన్నారు. గణేష్ ఉత్సవాల్లో భాగంగా మౌలిక సదుపాయాలైన తాగునీరు, విద్యుత్, లైటింగ్, శానిటేషన్, ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. నిమజ్జనం వద్ద గతంలో కంటే ఎక్కువ సంఖ్యలో క్రేన్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. అలాగే గజఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని ఫిషరీస్ అధికారులను ఆదేశించారు. అన్నిశాఖల సమన్వయంతో గణేష్ ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 11న జరిగే నిమజ్జనానికి పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని డీఎస్పీ సోమన్నను ఆదేశించారు. ముఖ్యంగా పట్టణంలో ఉండే సీసీ కెమెరాలు పని చేస్తున్నాయా లేదా తనిఖీ చేయాలన్నారు. అంతకముందు సబ్‌కలెక్టర్ నిమజ్జనం చేసే కెనాల్ స్థల ప్రాంతాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ట్రైనీ డీఎస్పీ ధీరజ్, తహసీల్దార్ శివరాముడు, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, డీఎల్‌పీఓ నూర్జహాన్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సిసిరాదీప్తి, డిప్యూటీ డీఎంహెచ్ఓ సత్యవతి తదితరులు పాల్గొన్నారు.



వినాయక ఘాట్‌ను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్

ముసాయిదా జాబితా తయారు చేసుకోవాలి

ఆదోని రూరల్: స్పెషల్ సమ్మరీ రివిజన్‌కు సంబంధించి అక్టోబర్ 29వ తేదీ నాటికి ముసాయిదా ఓటరు జాబితా తయారు చేసుకోవాలని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సూచించారు. శుక్రవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో బీఎల్‌ఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా రూపొందించడానికి ఆగస్టు 20 నుంచి అక్టోబర్ 18వ తేదీ వరకు బీఎల్‌వోలు ఇంటింటా ఓటర్ల సర్వే ప్రక్రియ చేపట్టడం జరుగుతుందన్నారు. అక్టోబర్ 19 నుంచి 28వ తేదీ వరకు దరఖాస్తుల పరిశీలన, 2న సంక్షిప్త ముసాయిదా ఓటర్ల జాబితా రూపొందించడం జరుగుతుందన్నారు. తహసీల్దార్ శివరాముడు, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ రామేశ్వర్‌రెడ్డి, డీఎల్‌పీఓ నూర్జహాన్ పాల్గొన్నారు.

ధరలు తగ్గించాలి

ఎమ్మిగనూరుటౌన్: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి అనీఫ్ ,రైతు కూలీ సంఘ జిల్లా కార్యదర్శి ఏసేపు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఆసంఘ నాయకుడు చిన్ని ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల ముందు నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తామని హామీలు గుప్పించారన్నారు. అధికారంలోకి వచ్చి మూడు నెలలవుతున్నా పట్టించుకోలేదన్నారు.

వ్యవసాయ పనిముట్లను సద్వినియోగం చేసుకోవాలి

పెద్దకడబూరు: ప్రభుత్వం నుంచి అందించే వ్యవసాయ పనిముట్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నార్మ్ సంస్థ, ఎస్సీ సబ్‌ప్లాన్ చైర్మన్ డాక్టర్ ఎం.బాలకృష్ణన్ సూచించారు. మండల పరిధిలోని హెచ్.మురవణి గ్రామంలో ఎస్సీ సబ్‌ప్లాన్ 2023 – 24 పథకం కింద జాతీయ వ్యవసాయ పరిశోధనా నిర్వహణ(నార్మ్) సంస్థ వారు 330 ఎస్సీ కుటుంబాలకు మండల వ్యవసాయాధికారి ఎం.వరప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం టార్పాలిన్‌లు, వ్యవసాయ ఉపకరణాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ నార్మ్‌సంస్థ హైదరాబాద్ కార్యాలయంగా ఉంటూ దేశంలోని అన్ని రాష్ట్రాలలో కార్యకలాపాలు నిర్వహిస్తూ ఉంటుందన్నారు. వ్యవసాయ పరిశోధనతో పాటు వ్యవసాయ విస్తరణ పనులు కూడా నిర్వహిస్తుందని, దానికి అనుగుణంగానే ఈ రోజు ఎస్సీ రైతులకు పనిముట్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నార్మ్‌సంస్థ అధికారులు డాక్టర్ యం.రమేష్‌నాయక్(శాస్త్రవేత్త), టెక్నికల్ ఆఫీసర్లు డాక్టర్ విజయేంద్రరెడ్డి, డాక్టర్ లక్ష్మణ్ అహిరే, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రైతులకు వ్యవసాయి పనిముట్లను పంపిణీ చేస్తున్న నార్మ్‌సంస్థ అధికారులు

వేళకు విద్యార్థి బస్సు నడపాలి

ఆదోని సెంట్రల్: విదార్థి బస్సును పాఠశాలలు, కళాశాలల సమయానికి నడపాలని ఎఐఎస్ఎఫ్ నాయకులు దస్తగిరి, ఎస్ఎస్‌యూఐ నాయకులు బాలకృష్ణ యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్ఎస్‌యూఐ, ఎఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆర్టీసీ డిపో ముందు ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ మండల పరిధిలోని బదినేహాల్ గ్రామం నుంచి వందల మంది విద్యార్థులు విద్యను అభ్యసించడానికి పట్టణానికి వస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు నరసప్ప, శివ, రఘు, స్వామి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

సంపన్న వర్గాలకు రిజర్వేషన్లు తొలగించాలి

ఎమ్మిగనూరుటౌన్: దళిత, గిరిజనుల్లో భార్య, భర్తలిద్దరూ ప్రభుత్వ ఉద్యోగులైతే అలాంటి సంపన్న వర్గాల వారి వారసత్వానికి రిజర్వేషన్లను తొలగించి, నిరుపేదలకు రిజర్వేషన్ వర్తించే విధంగా క్రిమిలేయర్ అమలు చేయాలని జైభీమ్ ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చిక్కం జానయ్య కోరారు. శుక్రవారం మండల పరిధిలో పలు గ్రామాల్లో ఆయన పర్యటించారు. కార్యక్రమంలో జైభీమ్ ఎంఆర్‌పీఎస్ నాయకులు హనుమన్న, బుజ్జిబాబు, సూరి, ఆదాము, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో తల్లీబిడ్డల ఆరోగ్యం

పెద్దకడబూరు: గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన పిల్లలకు జన్మనిస్తారని ఆది ఆంధ్ర పాఠశాల హెచ్ఎం సహదేవుడు, ఎంఎల్‌హెచ్‌పీ సోమేశ్వరి అన్నారు. మండల పరిధిలోని హెచ్.మురవణి గ్రామంలో పౌష్టికాహార మాసోత్సవాలు కార్యక్రమంలో భాగంగా పౌష్టికాహారంపై గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు శారద, పద్మ, అనిత, ఏఎన్ఎంలు సుకన్య, లోకేశ్వరి పాల్గొన్నారు.

ఆదోని అర్బన్: ఆదోని పట్టణంలోని డైమండ్ బ్రాంచి సాయి భారతి హైస్కూల్‌లో శుక్రవారం ఆదోని లయన్స్ క్లబ్, అవోపా, వామ్ ఆధ్వర్యంలో పౌష్టికాహార వారోత్సవాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా లయన్స్ క్లబ్ చైర్మన్ ప్రసాదరావు, అధ్యక్షుడు ధర్మారెడ్డి, కార్యదర్శి శ్రీనాథ్‌గుప్తా పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



పట్టుబడిన మద్యాన్ని మీడియాకు చూపుతున్న సెబ్ సీఐ భార్గవరెడ్డి

ఎమ్మినూరురూరల్: సెబ్ సర్కిల్ పరిధిలోని మంత్రాలయం మండలం మాధవరం చెక్ పోస్ట్ వద్ద అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు సెబ్ సీఐ భార్గవరెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక సెబ్ కార్యాలయం ఆవరణలో పట్టుబడిన మద్యాన్ని మీడియాకు చూపించారు. ఆయన మాట్లాడుతూ మాధవరం చెక్ పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు వేర్వేరుగా బైక్‌పై కర్ణాటక మద్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు. పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీకి చెందిన గరీబ్ మహమ్మద్‌అల్తాఫ్‌ను అరెస్ట్ చేసి 288 ఒరిజినల్ చాయిస్ డిలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లు, హీరో హోండా బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అలాగే పట్టణంలోని ఇంద్రానగర్‌కు చెందిన వినోద్‌ను అరెస్ట్ చేసి 384 (90ఎంఎల్) ఒరిజినల్ చాయిస్ డిలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రెండు కేసుల్లో పట్టుబడిని మద్యం విలువ రూ. 60,000 వేలు ఉంటుందన్నారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ నిందితులను రిమాండ్‌కు ఆదేశించినట్లు తెలిపారు. తనిఖీల్లో చెక్‌పోస్ట్ ఇన్‌చార్జ్ ఎస్ఐ వీరాస్వామి, సెబ్ కానిస్టేబుల్స్ భరత్, నరసింహారెడ్డి, రాధమ్మ, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న మద్యంను చూపుతున్న సీఐ,ఎస్ఐ

కౌతాళం: మండలంలో ఎవరైనా అక్రమ మద్యం విక్రయించినా రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవని సీఐ అశోక్‌కుమార్, ఎస్ఐ మహమ్మద్ రిజ్వాన్ అన్నారు. శుక్రవారం మేళిగనూరు–నదిచాగి గ్రామాల మధ్య వాహనాల తనిఖీ చేస్తుండగా మండల పరిధిలోని బంటకుంట గ్రామానికి చెందిన కుమార్, రాఘవేంద్ర, మల్లయ్యతో పాటు ఉరుకుంద గ్రామానికి చెందిన ఈడిగ మల్లయ్య, కాత్రికి గ్రామానికి చెందిన మహేంద్ర ద్విచక్ర వాహనాలపై కర్ణాటక మద్యం టెట్రాప్యాకెట్లను తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. వారి వద్ద నుంచి 30బాక్సుల మద్యంతో పాటు 4 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని వారిని అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు తెలిపారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ


ఎమ్మిగనూరుటౌన్: దివ్యాంగులు ఫిజియోథెరపీని క్రమం తప్పకుండా చేస్తే మంచి ఫలితం ఉంటుందని ఫిజియోథెరపీ వైద్యుడు జమిల్ తెలిపారు. పట్టణంలోని భవిత కేంద్రంలో శుక్రవారం దివ్యాంగులైన విద్యార్థులకు ఫిజియోథెరపీ శిబిరాన్ని నిర్వహించారు.

అధికారులు మొద్దునిద్ర వీడాలి

పెద్దకడబూరు : మండల పరిషత్ అధికారులు మొద్దునిద్ర వీడి మండలంలో నెలకొన్న సమస్యలపై దృష్టి సారించాలని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు భాస్కర్ యాదవ్, మండల కార్యదర్శి వీరేష్ అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శుక్రవారం వారు మాట్లాడుతూ వర్షాల కారణంగా ఎక్కడ చూసినా రోడ్లన్నీ గుంతలమయంగా మారి మురుగునీటితో నిండిపోయాయి కంపు కొడుతున్నాయన్నారు. డ్రైనేజీలు చెత్తా చెదారంతో నిండిపోయి మురుగునీరు మొత్తం రోడ్లపై పారుతున్నాయన్నారు. ఏఐవైఎఫ్ డివిజన్ అధ్యక్షుడు జాఫర్‌పటేల్, నాయకులు తిక్కన్న, హనుమంతు, సుభాన్, రామాంజినేయులు, రెక్కల గిడ్డయ్య పాల్గొన్నారు.

వినియోగదారులకు మెరుగైన సేవలే లక్ష్యం


మంత్రాలయం : వినియోగదారులకు మెరుగైన టెలికామ్ సేవలు అందించడమే ట్రాయ్ లక్ష్యమని ట్రాయ్ కాగ్ సభ్యులు డాక్టర్ బత్తుల సంజీవరాయుడు తెలిపారు. శుక్రవారం స్థానిక రాఘవేంద్ర డిగ్రీ కళాశాలలో టెలికామ్ వినియోగదారులకు పీఎస్ఎస్ ఎడ్యూకేషనల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టెలికామ్ రంగంలో అమలు చేసిన ఆర్థిక సంస్కరణలు ద్వారా 110 కోట్లు మంది వినియోగదారులు మనదేశంలో ట్రాయ్‌ద్వారా మెరుగైన సేవలు పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ ఎస్‌జీఓ శ్రీనివాసులు, జేటీఓ శంకర్, శివకుమార్, వడ్డే నారాయణ, కళాశాల కరస్పాండెంట్ సుబరాయుడు, ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ట్రాయ్ కాగ్ సభ్యులు డాక్టర్ బత్తుల సంజీవరాయుడు

వక్ఫ్ చట్ట సవరణను ఉపసంహరించుకోవాలి

కౌతాళం: వక్ఫ్‌బోర్డు చట్ట సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని కోరుతూ ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రమైన కౌతాళంలో ముస్లింలు గళమెత్తారు. వందలాది మందితో పాతబస్టాండ్, మెయిన్‌రోడ్డు, పురవీధుల గుండా వైఎస్సార్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. మానవహారంగా ఏర్పడి బిల్లుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆవాజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సుభాన్, ఖాదర్‌లింగస్వామి దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, జైభీమ్ సభ్యుడు, కౌతాళం సర్పంచ్ పాల్‌దినకర్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ఏదో విధంగా ముస్లిం మైనారిటీలను ఇబ్బంది పెట్టాలని కక్ష సాధింపును కొనసాగిస్తూనే ఉందన్నారు. గతంలో ఎన్ఆర్‌సీ, ఎన్‌పీఆర్, సీఏఏ, హిజాబ్, వంటి రకరకాల చట్టాలను తెచ్చి పలు రాష్ట్రాల్లో ఆందోళన జరిగేల చేసిందని, ఇప్పుడు ఈ వక్ఫ్ చట్టంతో మరోసారి మైనారిటీలను మోసం చేయడానికి సిద్ధం అయ్యిందన్నారు. ఎన్నికల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ముస్లిం మైనారిటీలకు ఎలాంటి ఇబ్బంది, నష్టం జరగకుండా చూసే బాధ్యత మాది అని చెసిన వాగ్దానాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. కార్యక్రమంలో జామియ మస్జిద్, మదీనా మస్జిద్, నూరాని మస్జిద్, ఆక్సా మస్జీద్ నిర్వాహకులు ముస్లీం మత పెద్దలు, యువకులు పాల్గొన్నారు.



మనవహారంగా ఏర్పడి నిరసన తెలుపుతున్న దృశ్యం